గణిత పోటీల్లో 'గౌరీశంకర్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశకి-రైల్వేకోడూరు : కడప హజరత్ ఆయేశ స్కూల్ లో నిర్వహించిన అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని శ్రీ గౌరీశంకర్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న చెన్నంశెట్టి భరత్ కుమార్ జిల్లాలో మొదటి స్థానం సాధించాడని కరస్పాండెంట్ అదునుకోట గోపీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాల నుంచి దాదాపు 75 పాఠశాలలకు చెందిన 2500 మంది ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. స్టార్ జూనియర్స్ లెవెల్ వన్‌లో కె.సాత్విక్ రెండో బహుమతి, జూనియర్స్ లెవెల్ టులో హేమశ్రీ మూడవ బహుమతి, సీనియర్ లెవెల్ వన్‌లో ఎ.లక్ష్య శ్రీభ్రమర మూడవ బహుమతి సాధించారని తెలిపారు. ఈ బహుమతులు సాధించిన విద్యార్థులను రెస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ మాధవి, డైరెక్టర్ పుష్పలత, ఉపాధ్యాయులు శ్వేత, మోహన లక్ష్మి, రమేష్ అభినందించారు.

బహుమతులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

ఆదుకోని ప్రత్యామ్నాయ పంట

- జిల్లాలో 92,530 ఎకరాల్లో ఉలవ సాగు
- భారీగా తగ్గిన దిగుబడులు
- పెట్టుబడులూ దక్కని వైనం
- ఆందోళనలో రైతులు

కోతకు సిద్ధంగా ఉలవ పంట

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వరుస కరువుల నేపథ్యంలో ప్రధాన పంటలైన వేరుశనగ, కంది సాగును పంటలను రైతులు తగ్గిస్తూ ప్రత్యామ్నాయ పంట చిరుధాన్యాలైన ఉలవ పంట సాగుపై దృష్టి సారించారు. ఈ ఏడాదిలో నవంబర్, డిసెంబర్ మాసాలలో తుపాన్ వర్షాల వలన ఉలవ పంట సాగు భారీగా పెరిగిన కూడా గింజలు లేవని రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యామ్నాయ పంటగా ఉలవ పంటను ఎక్కువగా సాగు చేశారు. వేరుశనగ సాగు చేసినా పది సంవత్సరాలుగా అతివృష్టి అనావృష్టితో వరస నష్టాలను రైతుల చూస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు పంటల సాగు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాదిలో కూడా ఉలవ పంట దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. ఈ ఏడాదిలో మంచి దిగుబడి వస్తుందని రైతులు అసలు పెట్టుకున్నప్పటికీ ఊహించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో ఉలవ రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 92,530 ఎకరాలలో ఉలవ పంటను సాగు చేశారు. ఉలవ పంట మాత్రం ఏపుగా బాగా పెరిగింది కానీ అందులో అరకొర గింజలు పట్టాయని రైతులు వాపోతున్నారు. మొదటగా ఉలవ పంట ఏపుగా పెరిగింది. పంట అదిక దిగుబడి వస్తుందని రైతులు భావించారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాభావం నెలకొనడంతో దిగుబడిపై ప్రభావం పడింది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాలేదని ఉలవ రైతుల ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఉలవ పంటకు గిట్టుబాటు ధర కల్పించి, నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మండలాలవారీగా ఉలవ పంట సాగు

జిల్లాలోని పీలేరులో 1735 ఎకరాల్లో ఉలవ పంటను సాగు చేశారు. కె.వి పల్లెలో 2104, వాల్మీకిపురంలో 1117, గుర్రంకొండలో 1174, కలికిరిలో 1169, కలకడలో 817, పెద్దమండెంలో 1424, మదనపల్లిలో 1402, నిమ్మనపల్లిలో1301, రామసముద్రంలో 1268, బి.కొత్తకోటలో 2242, కురుబలకోటలో 1518, తంబళ్లపల్లెలో 3176, ములకలచెరువులో 2837, పెద్దతిప్ప సముద్రంలో 3241, చిట్వేలులో 1, వీరబల్లిలో 662, రామాపురంలో 1247, గాలివీడులో 1204, లక్కిరెడ్డిపల్లిలో 1317, చిన్నమండెంలో 716, సంబేపల్లిలో 2072 సుండుపల్లెలో 2256, రాయచోటిలో 1012 ఎకరాల్లో ఉలవ పంటను జిల్లాలో సాగు చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఉలవ సాగు చేసి పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత రైతుకు పెట్టుబడి సాయం, రైతు భరోసా,పంటల నష్టపరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి లను ఆదుకోవాలి.

- పామయ్య. రైతు, పి.ఎన్.కాలవ, సుండుపల్లి.

నష్టపరిహారం అందించాలి

జిల్లాలో రైతన్నలు అత్యధికంగా ఉలవ పంటసాగు చేశారు. ఈ సంవత్సరంలో ఉలవ దిగుబడి తగ్గింది. రైతన్నలను ప్రభుత్వం అన్ని పంటల మాదిరి గానే ఉలవ పంట కూడా ఆర్థిక సహాయం చేయాలి. రైతన్నలకు చిరుధాన్యాలు, ఉలవ, కంది, పెసర, మినుములు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి. ఉలవ పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే రైతులను ఆదుకోవాలి. రైతన్నలను వేరుశనగ, వరి పంటలను పండించడానికి రైతులు సమకంగా లేరు. ప్రత్యామ్నాయ పంటలుగా చిరుధాన్యాలు పండించాలని ప్రభుత్వం అవగాహన కల్పించి, పూర్తి సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి. పెట్టుబడి సహాయం కూడా రైతన్నలకు ఇవ్వాలి.

- సి.రామచంద్ర, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం, రాయచోటి.

పంట దిగుబడి తగ్గింది

ఉలవ పంట ఏడాది తగ్గిన మాట వాస్తవమే. నవంబర్, డిసెంబర్ మాసాలలో వరుసగా వర్షాలు కొరవడం వలన ఉలవ పంట దిగుబడి తగ్గింది. గతంలో ఎకరాకి ఐదు క్వింటాళ్లు ఉలవ పండేది. ఈ ఏడాదిలో ఎకరాకి 3, 4 క్వింటాళ్ల పంట వచ్చింది.

- బి.చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.

ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

జీవో నెంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాల పేరుతో చేపట్ట బోయే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనాన్ని ఆపాలని , ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులకు యుటిఎఫ్ యూట్యూబ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరిప్రసాద్, షేక్. జాబీర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు క్రమేణా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 117 అమలుపరిచి ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి తప్పులను సరిచేసి విద్యా వ్యవస్థను గాడిలోకి తీసుకువచ్చేందుకు 117 జీవోను రద్దు చేస్తామని తెలిపారని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ చర్యలనే చేపడుతోందని ఆరోపించారు. ఒక పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను అన్నింటిని విలీనం చేయడం, ప్రాథమికోన్నత పాఠశాలల మనుగడే లేకుండా చేస్తుందని చెప్పార. దీనివల్ల భవిష్యత్తులో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. చిన్న పిల్లలు ఒక కిలోమీటర్ దూరం పైగా ప్రయాణం చేసి పాఠశాలలకు వెళ్లడం అంటే ఎంతో కష్టతరమవుతుందని, కాబట్టి విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల విషయంలో విద్యార్థుల సంఖ్య 60 పైబడి ఉన్నప్పటికీ ఆ పాఠశాలలకు తగినన్ని తరగతి గదులు కానీ, మౌలిక వసతులు కానీ లేకపోతే వాటిని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపివేస్తామనడం ప్రభుత్వ నియంతృత్వపోకడకు నిదర్శనమని తెలిపారు. మౌలిక వసతులు, మూడు కిలోమీటర్ల దూరంతో సంబంధం లేకుండా 60 పైబడి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటినీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 60 పైబడి విద్యార్థులు ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీగా తీర్చి దిద్దడమే కాకుండా అందులో ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయులను కూడా నియమించాలని, ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా నిర్ణయించాలని కోరారు. తెలుగు మాధ్యమం కొనసాగించాలని, ప్లస్ టు పాఠశాలలను రద్దు చేయవద్దని, జూనియర్ లెక్చరర్స్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే డిఎస్‌సి నిర్వహించి ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉర్దూ మాధ్యమ పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు ఎస్. శివారెడ్డి, కోశాధికారి బి. చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు డి.చెంగల్ రాజు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు పి. వెంకట రమణ, పి.వెంకట సుబ్బయ్య, వై.శ్రీధర్ రెడ్డి, ఎ.అక్రం బాషా, కె.ఆదినారాయణ, ఎస్.దావుద్దీన్, ప్రచురణల విభాగం జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న అన్నమయ్య జిల్లాల్లో అన్నమయ్య ప్రాజెక్ట్, పింఛా డ్యామ్ పూర్తిగా కొట్టుకుపోయిన తర్వాత వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్ పనులు పూర్తి చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టుకు ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా నీళ్లిచ్చి అన్నమయ్య జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ దిశగా మాత్రం పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. హంద్రీ-నీవా ద్వారా 80 టిఎంసిలు నీళ్లవడం ద్వారా సాగును పెంచవచ్చన్నారు. కాలువలను వెడల్పు చేయడం, లైనింగ్ చేయడం ద్వారా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్ కోసం 786 ఎకరాల భూములను రైతులనుంచి సేకరించి ఒక్క రూపాయి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. సుమారు 5 గ్రామాలు ముంపుకు గురవుతున్నా బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం దోబూచు లాడుతోందని పేర్కొన్నారు. సిపిఎం పోరాటం వల్ల రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని అవార్డు పాస్ చేసిందని పేర్కొన్నారు. గాలేరు-నగరి నుంచి కృష్ణ జలాలను తీసుకొచ్చేందుకు గండికోట నుంచి పైపులైను కోసం తంబళ్లపల్లె నియోజకవర్గంలో 4 మండలాల రైతుల నుంచి 800 ఎకరాలు భూములు సేకరించి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. అన్నమయ్య జిల్లాలో వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టమోటా హబ్, తోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ప్రజా పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీదారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినియోగంలోకి వచ్చిన ఆర్టీసీ బస్టాండ్ మరుగుదొడ్లు

వినియోగంలోకి మరుగుదొడ్లు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

'ఆర్‌టిసి బస్టాండ్‌లో మరుగుదొడ్లను వినియోగంలోనికి తేవాలి' అనే శీర్షికతో జనవరి 30న కథనం వెలువడింది. కథనానికి అన్నమయ్య జిల్లా రాయచోటి డిపో వారు స్పందించి బోరు మరమ్మతులు చేయించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లకు తాళాలు తెరిపించి మహిళలకు, ప్రయాణికులకు అందుబాటులో ఉంచే విధంగా వినియోగంలోకి తీసుకొచ్చారు. మరుగుదొడ్లు అందుబాటులోకి రావడంతో మహిళా ప్రయాణికులు, కండక్టర్లు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

కొబ్బరి సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొబ్బరి సాగు, సైకిల్ వాడకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల మాట్లాడుతూ కెవికెలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని కలికిరి, సదుం, కె.వి.పల్లి, వాల్మీకిపురం నుంచి 20 మంది కొబ్బరి రైతులు ఉత్సాహంగా పాల్గొని కొబ్బరి చెట్టు సైకిల్ ద్వారా ఎక్కడం సాధన చేసి నేర్చుకున్నందుకు అభినందనలు తెలిపారు. చివరి రోజున కొబ్బరి చెట్టు ఎక్కే పోటీ నిర్వహించారు. మొదటి బహుమతిని ఎం.అజీజ్, రెండవ బహుమతి సందీప్ కుమార్‌రెడ్డి, మూడో బహుమతిని వంశీకృష్ణ అందుకున్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొబ్బరి రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల్లో చెట్టు నుంచి కాయలు కోయడం కాబట్టి ఈ శిక్షణ కొబ్బరి రైతులకు చాలా ఉపయోగకరమైందని హర్షం వ్యక్తం చేశారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, మాట్లాడుతూ కొబ్బరి సాగులో రకాల ఎంపిక, సాగులో మెలకువలు మరియు సైకిల్ ఉపయోగించే విధానం గురించి తెలుసుకున్న విషయాలు ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కొబ్బరి సాగులో పురుగులు, తెగుళ్ల నివారణకు కూడా ఈ సైకిల్ వాడుకోవాలని సూచించారు. సూచనలు తోటల్లో పాటించి ఇతర రైతులకు కూడా తెలపాలని తెలియజేశారు. శిక్షణ తీసుకున్న రైతులు ఈ కార్యక్రమంలో వారి అభిప్రాయం, అనుభవాలను తెలియజేశారు. ఈ శిక్షణ వారికి చాలా సంతృప్తినిచ్చిందని, వారు కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు కోసుకోవడంలో, కొబ్బరిలో ఎరువులు, పురుగులు, తెగుళ్ళ సంరక్షణ, యాజమాన్యంలో ఉపయోగించికుంటామని తెలియజేశారు. రైతులకు సర్టిఫికెట్లు, కొబ్బరి చెట్టు ఎక్కే సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది, శిక్షణకు వచ్చిన రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర బడ్జెట్-2025లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మెండి చేయి చూపారని, టిడిపికి రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ విమర్శలు గుప్పించారు. 2025-25 సంవత్సరానికిగానూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించక పోవడంపై రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ చేతగాని తనంగా అభివర్ణించారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని విమర్శించారు. బీహార్ రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు కురిపించిందని గుర్తు చేస్తూ, రాష్ట్రంలో కూటమి సర్కారే ఉన్నా, అందులో టిడిపికి పదహారు మంది ఎంపీలు ఉన్నా నిధులు తీసుకు రావడంలో వారంతా విఫలమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి కూడా భాగస్వామ్య పార్టీనే అన్న విషయాన్ని గుర్తుచేశారు. బీహారుతో పోలిస్తే ఏపీకి బడ్జెట్-2025లో దక్కిన వాటా శూన్యమని చెప్పుకొచ్చారు.గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వంగివంగి దండాలు పెడుతున్నారని విమర్శించి, ఇప్పుడు ఆయనే వంగిపోయాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై చంద్రబాబునాయుడు ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు రావడం, ట్యాక్సులు తగ్గడం ద్వారా రైతులకు, నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు ప్రత్యేక హోదా సాధించడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె బాషా, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్

రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి-రామాపురం

ఇడబ్ల్యుఎస్‌కమ్యూనిటీలలో బిలోపావర్టీ లైన్‌కు దిగువున్నవారు కాపు, బిసి యువతకు 2024-25 ఆర్థిక సంవత్సరం కింద కార్పొరేషన్ రుణాలు మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపిడిఒ జాషువా ప్రకటనలో తెలిపారు. మెడికల్ సంబంధించి బి ఫార్మసిస్ట్, ఎం ఫార్మసిస్ట్ చేసిన అభ్యర్థులు వ్యవసాయానికి రంగానికి ఫెస్ట్ లేజర్స్ వ్యాపారం ఇండస్ట్రీస్ తదితరంగాలలో ఆసక్తిగల యువతకు ఈ రుణాలు 50 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందజేస్తున్నారన్నారు. ఎపిజిబి 12 ఎస్ బి ఐ 11 యూనియన్ బ్యాంక్ ఏడు యూనిట్లకు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

మ్యాపింగ్ తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

మ్యాపింగ్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందవని ప్రతి ఒక్కరూ మ్యాపింగ్ చేసుకోవాలని ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభాభవనంలో పంచాయతీ కార్యదర్శితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ ఇవ్వడానికి ఒటిపి నంబర్ చెప్పడానికి ప్రజలు సమాచారం ఇవ్వడం లేదని, రేషన్ కార్డులు, భూములు ఉంటే వారు రెవెన్యూ అధికారులు కూడా సహకరించడం లేదని సెక్రటరీలు పేర్కొన్నారు. మ్యాపింగ్ కాకుండా కుటుంబంలో ఎవరైనా తప్పిపోయి ఉంటే వారిని చేర్చుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేకుండా పోతాయని వినియోగదారులకు హెచ్చరించారు. గ్రామానికి సర్వే కొచ్చే పంచాయతీ కార్యదర్శులకు ప్రజలందరూ సహకారం అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్ సెక్రటరీలు సుకుమార్, కాలేబు, శివా నాయక్, మదన్ మోహన్, నరేష్, రసూల్ పాల్గొన్నారు.

'ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగభూషణం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించి అన్నమయ్య జిల్లాలో జరగబోయే ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ పరిపాలన అధికారి అధ్యక్షతన ఇంటర్మీడియట్ విద్య, ఎపిఎస్ ఆర్‌టిసి, పోలీస్, వైద్య, విద్యుత్, తపాలా తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి ఎం.కృష్ణయ్య జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల గురించి వివరించారు. జిల్లాలో ఈనెల 10 నుంచి 19 వరకు 63 పరీక్ష కేంద్రాలలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 49 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో మొత్తం 28602 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్నారని వీరిలో మొదటి సంవత్సరం 14855 మంది, రెండవ సంవత్సరం 13747 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్స్‌కు 8476 మంది జనరల్ విద్యార్థులు, 2156 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలకు సంబంధించి 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కాపీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకునేలా ఆర్‌టిసి వారు బస్సులను నడపాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త రాదని అధికారులను ఆదేశించారు. పరీక్షల కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆ శాఖ వారిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మందులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పరీక్షా అనంతరం జవాబు పత్రాలను తగిన విధంగా స్పీడ్ పోస్ట్ ద్వారా తీసుకువెళ్లేందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య, పోలీసు, వైద్య, ఎపిఎస్‌పిడిసిఎల్, ఆర్‌టిసి, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ నాగభూషణం

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి- రాయచోటి : విద్యుత్ శాఖ ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ద్వారా సులభతరంగా, సమర్థవంతంగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యుగంధర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులకు సంబంధించి మీకు ఇచ్చిన కరెంట్ బిల్లు డిమాండ్ నోటీసు కింద భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ను పేమెంట్ యాప్‌ల ద్వారా స్కాన్ చేసిన వెంటనే బిల్లుకు సంబంధించి అమౌంటు సంబంధిత 13 అంకెల గల విద్యుత్ సర్వీస్ నెంబరు యాప్‌లో కనిపిస్తుందిదని చెప్పారు. దీనినే నిర్ధారణ చేసుకొని కరెంట్ బిల్లులు చెల్లించాలని సూచించారు. వినియోగదారులు మీ ఇంటి వద్ద నుండే కరెంట్ బిల్లు కట్టుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ ఆర్.పాపయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చాన్ బాష, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఇఇ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, సహకార శాఖ అధికారులు

సహకార శాఖ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

ఐక్యరాజ్యసమితి, 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని, 'సహకార సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి' అనే నినాదంతో ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరానికి ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రమాదేవి, జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్ పాల్గొన్నారు.

రిలేదీక్షలకు మద్దతు తెలుపుతున్న సిపిఐ లిబరేషన్ నాయకులు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో తొలగించిన సబ్ స్టాప్ స్కూలు గేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా సిపిఐ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు చెన్నయ్య మాట్లాడుతూ గత నెల రోజులకు పైగా ధర్నాలు రిలే దీక్షలు చేస్తున్న కూడా ప్రిన్సిపాల్, ఎపిఎండిసి ఎండి, సిపిఒ స్పందించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల నుంచి నిర్వాసితులుగా పాఠశాలలో పనిచేస్తున్న వారిని కొత్త కాంట్రాక్టర్ ఉషోదయ ఎడ్యుకేషన్ సొసైటీ కాంట్రాక్టర్ అక్రమ పద్ధతిలో అగ్రిమెంట్ తెచ్చుకుని మూడు నెలలు పని చేయించుకొని జీతం అడిగితే ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. తొలగించిన సబ్ స్టాఫ్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు జయసింహ, హరి, కార్మికులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండ పై కటకట లాడారు పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మల్లయ్య కొండకు దిగువనన్న వెలుగు మల్లమ్మ అమ్మవారిని పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు.పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

డాక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

సమాజంలో వైద్యవృత్తి మహోన్నతమైంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమాజంలో వైద్యవ ృత్తి మహోన్నతమైనదని బిజెపి నాయకులు పేర్కొన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.కొత్తకోటలోని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులు హసీనా మరియు ఇతర వైద్యులకు మండల బిజెపి నాయకులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం రోగులకు వైద్యసేవలు అందిస్తూ, వృత్తిలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యుల పాత్ర అమోఘ మన్నారు. ఎంతోమంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వైద్యం అందించి పునర్జన్మ అందిస్తున్న వైద్యులు ప్రత్యక్ష దైవంతో సమానమన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి,మురళి,ప్రసాద్, కృష్ణమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ పీలేరు ఫారెస్ట్ రేంజ్ అధికారిణి బి.ప్రియాంక తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు-తలపల మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి నుంచి తాము తమ సిబ్బందితో పీలేరు మండలం, జాండ్ల గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తలు పుల గ్రామం నుంచి పీలేరు వైపు వస్తున్న మారుతి కారును తాము ఆపగా అది ఆగకుండా పీలేరు వైపు వేగంగా దూసుకు పోయిందన్నారు. అప్రమత్తమైన తాము ఆ కారును వెంబడించి పీలేరు మండ లం, గూడరేవుపల్లి గ్రామం వద్ద అటకాయించి, అందులోని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కారులోని వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, తిరువన్నామలై జిల్లా, కొల్లూరు తాలూకా, నమ్మియం పొట్టు పోస్టు, వల్లియర్ గ్రామానికి చెందిన ఎ.విజయ్ కాంత్‌గా తెలిసిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా అందులో లక్షలు విలువ చేసే 36 కిలోల బరువుగల మూడు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయన్నారు. నిందితుడితో సహా వాహనం, ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచామని చెప్పారు. ఈ దాడిలో పీలేరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి సబిహా సుల్తానా, బొంత కనుమలోని బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు ఆమె వివరించారు.

పట్టుబడిన వాహనం, ఎర్రచందనం, నిందితుడితో అటవీ శాఖ అధికారులు

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ అదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లలు, కిశోర బాలలకు (ఒక సంవత్సరం నుండి 18 సంవత్సరాల వయసు గల పిల్లలకు) ఉచితంగా ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలలో ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్ర పంపిణీ చేస్తామన్నారు. నులిపు రుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు మాత్రలను అందజేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ పాల్గొన్నారు.

కిషోర బాలికల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

రైతు ప్రమేయం లేకుండానే మ్యుటేషన్ దరఖాస్తు

- డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు ఫిర్యాదు

ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతు శాంతమ్మ

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని చొకాండ్లపల్లి పంచాయతీ పురాండ్లపల్లి గ్రామంలో నివసిస్తున్న ఓ మహిళ రైతు సదరు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌పై ఎంపిడిఒ భానుప్రసాద్‌కు ఫిర్యాదు. వివరాల్లోకి వెళితే గంగవరం మండలం, రెంటకుంట్ల గ్రామానికి చెందిన టి.వెంకటాచలపతి భార్య టి.శాంతమ్మ అనే రైతుకు వంశపారంపర్యంగా గంగవరం గ్రామ రెవెన్యూ లెఖ్ఖలపైకి సర్వే నెం.346/20-1ఎలో ఎ.3.68 సెంట్లు మరియు సర్వే నెంబరు. 346-2ఎ3లో ఎ.0.81 సెంట్లు వ్యవసాయ భూమి సంక్రమించింది. భర్త మరణాంతరం ఆమె రామసముద్రం మండలంలోని పురాండ్లపల్లి గ్రామంలో నివసిస్తూ సదరు భూమిని ఆమె కుటుంబ అవసరాల నిమిత్తం గంగవరంకు చెందిన సి.పి.బాలు సోమనాథ్ భార్య ఎస్.ఆర్ లేఖ్యకు అను వారికి పలమనేరు సబ్ రిజిష్టరు కార్యాలయంలో దస్తావేజు నెం.294/2024 విక్రయ దస్తావేజు ద్వారా గంగవరం గ్రామ రెవెన్యూ లెఖ్ఖల పైకి సర్వే నెం. 346/26-16లో ఎ.3.68 సెంట్లు భూమిని విక్రయించారు. గంగవరంకు చెందిన సిఎం కృష్ణయ్య కుమారుడు సి.కె. ప్రకాష్‌కు పలమనేరు సబ్ రిజిష్టరు కార్యాలయంలో దస్తావేజు నెం.295/2024 విక్రయ దస్తావేజు ద్వారా గంగవరం గ్రామ రెవెన్యూ లెఖ్ఖల పైకి సర్వే నెం.346-203లో ఎ.0.81 సెంట్లు భూమి విక్రయించి ఉన్నారు. సదరు భూమినిపై కొనుగోలు చేసిన వారిపై గంగవరం రెవెన్యూ రికార్డుల నందు వారికి 1బి, అడంగల్ నమోదు చేశారు. ఎవరి అనుమతి లేకుండా 31.01.2025 తేదిన రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లె సచివాలయం ఐడి. 11090063 ద్వారా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులతో చొక్కాండ్లపల్లె సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కె.దిలీప్ కుమార్ కుమ్మకై నా సంతకాలను ఫోర్జరీ చేయడమేకాక కాక తప్పుడు పత్రాలతో నా పేరుపై ఆన్‌లైన్‌లో మ్యుటేషన్‌ను నమోదు చేశారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు ఫిర్యాదు చేసారు. మ్యుటేషన్‌ను ఆన్‌లైన్‌లో నా పేరున నమోదు చేసిన దానిని రద్దు పరిచి, నా ప్రమేయం లేకుండా నా సంతకాలను ఫోర్జరీ చేసి, తప్పుడు పత్రాలతో మ్యుటేషన్‌ను ఆన్‌లైన్ నమోదుకు ప్రయత్నించిన డిజిటల్ అసిస్టెంట్ కె.దిలీప్, కుమార్తె అతనితో కుమ్మకైన వ్యక్తులపై విచారణ జరిపి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరి ప్రార్థిస్తున్నానని వినతిపత్రం అందజేశారు.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడు లక్ష్యంగా వైవీయూ అడుగులు

- విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

న్యాక్ ఏ ప్లస్ గ్రేడు లక్ష్యంగా విశ్వవిద్యాలయం పయనిస్తోందని, అందులో భాగంగా దూరవిద్యలో పటిష్టం చేస్తున్నామని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి ఉద్ఘాటించారు. వైవీయూలోని అన్నమాచార్య సెనెట్ హాల్లో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా 8 కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఎంబిఎ(జనరల్), ఎంబిఎ (హెచ్ఆర్ఎం) కోర్సులు తీసుకు రానున్నామని ప్రకటించారు. వైవీయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడు రాగానే డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. ఉపాధి అవకాశాలు గల కోర్సులు తీసుకు రావాలని కోరుతున్నారని, అందుకు తగ్గ కర్సిక్యు లమ్ ఆచార్యులు రూపొందిస్తే తాము తేవడానికి సిద్ధమన్నారు. వైవీయూ దూరవిద్య గురించి అందరూ విస్తృత ప్రచారం కల్పించాలని, ఉన్నత విద్యను అందరూ అభ్యశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కూడా పెరిగేందుకు కృషిచేద్దామని ఆకాంక్షించారు. 3,4 సెమిస్టర్ల మెటీరియల్‌ను సకాలంలో రూపొ ందించాలని సూచించారు. దూరవిద్యను సులభతరం చేస్తూ సకాలంలో కోర్సు పూర్తిచేసి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ చదువులపట్ల ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ ఉన్నత విద్యను అభ్యశించాలనే లక్ష్యంగా వైవీయూ దూరవిద్యను డోర్ స్టెప్‌నకు తీసుకు వెళుతోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ ప్రస్తుత యూని వర్సిటీ గ్రాంట్ కమిషన్ సూచించినట్లు దూరవిద్య, రెగ్యులర్ విద్య రెండూ సమానమేనన్నారు. అలానే ఒక కోర్సు రెగ్యులర్‌గా మరొక కోర్సు దూరవిద్యలో అభ్యసించే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ రెండు కోర్సులు చదువుకుని విస్తృత అవకాశాలు అందుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు దూరవిద్య సిలబస్ ఉపయుక్తమవుతుందన్నారు. దూరవిద్య ఉప సంచాలకులు డాక్టర్ ఎం. శ్రీధర్ బాబు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ హుమానిటీస్ డీన్ ఆచార్య కె.గంగయ్య, ఆచార్యులు బాయినేని శ్రీనివాసులు, ఎస్.ఈశ్వరరెడ్డి, టి. రామప్రసాద్ రెడ్డి, విజయభారతి, అనిత, గంజి పార్వతి, జి. పార్వతి, మెర్సీ విజేత, వినోదిని, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రమీళామార్గరేట్, జయంత్ కశ్యప్, సతీష్ బాబు, లలిత, సుదర్శనరెడ్డి, అంకన్న, హరనాథ్, పలు కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు హాజరై విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు, పుస్తకాల రచయితలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి కృష్ణారెడ్డి

ఎల్ఐసిలో ఎఫ్‌డిఐకి వ్యతిరేకంగా నేడు నిరసన

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐకి, విదేశీ బీమా కంపెనీల ప్రవేశానికి వ్యతిరేకంగా ఈనెల 4న నిరసన ప్రదర్శన నిర్వహి స్తున్నట్లు ఎల్ఐసి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవధానం శ్రీనివాస్, ఎ.రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం యూనియన్ కార్యాల యంలో 'బీమా చట్ట సవరణ బిల్లును తిరస్కరిద్దాం' పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు 2024ను ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సవరణలతో దేశానికి కానీ, పాలసీదారులకు కానీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సవరణలు చట్ట రూపొందితే, జాతీయకరణకు ముందు నాటి ప్రయివేటు కంపెనీల మోసాలు మళ్లీ పునరావృతమైతాయని తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లును తీవ్రంగా ప్రతిఘటిద్దామని పిలుపునిచ్చారు. జాతీయకరణ లక్ష్యాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎల్ఐసి ప్రపంచ స్థాయికి ఎదిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ ని వ్యతిరేకిద్దాం, విదేశీ కంపెనీలను తిరస్కరిద్దాం పేరుతో తాము ప్రచార కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

మొదటి ఇన్నింగ్స్‌లో హిమాచల్‌ప్రదేశ్ ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న కల్నల్ సి కె నాయుడు ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 436 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. 2 వికెట్ల నష్టానికి 159 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో మూడవరోజు బ్యాటింగ్ ప్రారంభించిన హిమాచల్ ప్రదేశ్ తన మొదటి ఇన్నింగ్ లో 124.3 ఓవర్లలో 436 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మిదుల్ పి.సురోచ్ 152 పరుగులు (సెంచరీ) చేశాడు. ఆర్యవట్ శర్మ 75, నారాయన్ 42 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని వాసు 5, శ్రీకర్ 3, కె.ఎస్.రాజు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది.



తలపడుతున్న ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ జట్లు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఎం.ఎ. ఫైజ్‌ఖాన్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్‌గా అమిత్ సింగ్

ప్రజాశక్తి - కడప

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నూతన ప్రిన్సిపల్‌గా అమిత్ సింగ్‌ను నియమించినట్లు గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఎం.ఎ. ఫైజ్‌ఖాన్ తెలిపారు. నూతన ప్రిన్సిపల్ అమిత్ సింగ్‌ను పాఠశాల బోధన సిబ్బందికి సోమవారం మధ్యాహ్నం అధికారికంగా పరిచయం చేశారు. అనంతరం గవర్నింగ్ కౌన్సిలింగ్ సభ్యులు ఎం. ఆదిత్య రెడ్డి, మసీయుద్దిన్ అహ్మద్, డాక్టర్ స్కంద్ బాలి సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అకడమిక్ ప్రతిభ, క్రీడలు, వినూత్న ఆలోచన, నాయకత్వం, నైతిక విలువలు పెంపొందించడం పై తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. విద్యార్థి- కేంద్రీకృత అభ్యాస వాతావరణం, అధ్యాపకుల సాధికారత, సృజనాత్మకత, శాస్త్రీయ దృష్టి, క్రమశిక్షణను పెంపొందించే సంస్కృతిని ప్రోత్సహించాలనె దృష్టి కోణాన్ని వివరించారు. పాఠశాల సమాజం ఆయన నాయకత్వంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎదురుచూస్తుందన్నారు.

రైతు సమస్యపై చర్చిస్తున్న తహశీల్దార్ భాగ్యలత

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - గాలివీడు

గ్రామాలలో భూ సమస్య ఉంటే వారిలో ఇరు వర్గాల వారు రాజీ పడి పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కె.భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ సభ భవనంలో నూలివీడుకు చెందిన భూ సమస్య పైన ఇరువు వర్గాల వారిని పిలిపించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, రైతులు, వెంకట్ రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

కోడ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు అవసగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్) కళాశాలలో కోడ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమానాథన్ తెలిపారు. సోమవారం ఆయన ఆయన మాట్లాడుతూ ఎ డిప్ డైవ్ ఇన్‌టు జావా డెవలప్‌మెంట్ అను అంశంపై రెండు రోజుల హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌ను బి.టెక్ విద్యార్థులకు నిర్వహిం చామన్నారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు ఈ వర్క్షాప్ ను నిర్వహించారు. జావాలో పాల్గొనేవారి ప్రోగ్రామింగ్ నైపుణ్యాన్ని పెంపొందించడం, స్ప్రింగ్, హైబర్నేట్ వంటి ప్రాథమిక భావనలు, అధునాతన ఫ్రేమ్‌వర్క్‌లను కవర్ చేయడం లక్ష్యంగా ఐఎస్‌టిఇ స్టూడెంట్ చాప్టర్‌తో కలిసి కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి చెన్నైలోని ఎల్అండ్‌టి టెక్‌లో టెక్నికల్ లీడ్ అయిన అలుమూరి సుబ్రహ్మణ్యం ఆయన మాట్లాడుతూ జావా డెవల ప్‌మెంట్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు జావా టెక్నా లజీ పై అవగహన పెంచుకోవాలన్నారు. ప్రోగ్రామింగ్‌లో ప్రాక్టికల్ లెర్నింగ్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఐటి పరిశ్రమలో కెరీర్ విజ యానికి జావాపై పట్టు సాధించడం చాలా ముఖ్య మని, విద్యా పరిజ్ఞానం, పరిశ్రమ పద్ధతుల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి వర్క్‌షాప్‌ల పాత్ర చాలా ఉంటుందని అన్నారు. జావా ఆధారిత అప్లికేషన్‌లను కోడింగ్ చేయడం, డీబగ్గింగ్ చేయడం, అమలు చేయడంపై ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందారు, వాస్తవ ప్రపంచ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించారు. కార్యకమంలో కళాశాల సిఎస్‌ఇ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ఐఎస్‌టిఇ కో-కోర్డినేటర్ దివ్య, డాక్టర్ ఆర్.నిత్య, కె.సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి

సిద్ధార్థ విద్యార్థికి 'లీడ్ ఛాంపియన్ షిప్'

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు విఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలలకు చెందిన చేతన్ విఖ్యాతి రెడ్డి ఢిల్లీలో నిర్వహించిన "లీడ్ ఛాంపియన్ షిప్ 2024 పురస్కారం" అందుకున్నాడు. సోమవారం పాఠశాలలో ఆ విద్యార్థికి అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి వై.లోకేశ్వర్‌రెడ్డి లీడ్ ఛాంపియన్షిప్ 2024 ఈవెంట్లో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్న విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థుల ప్రతిభతో పాఠశాలకే గర్వ కారణమని కొనియాడారు. చేతన్ విఖ్యాతిరెడ్డి ఈ స్థాయికి చేరుకోడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులకు విద్యాసంస్థ యాజమాని వడ్లమూడి మాధవిలకు ప్రత్యేక అభినం దనలు తెలియజేశారు. ఆ తరువాత విద్యార్థికి శాలువా, ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల యాజమాన్యాలు వడ్లమూడి మాధవి, విద్యార్థి తల్లిదండ్రులు గౌరీ, ద్వారకనాధ్, ఒలంపియాడ్ ప్రిన్సిపల్ సురేష్, ఉపాధ్యాయులు శ్రావణి, బాబు రెడ్డి, రెడ్డిప్రసాద్, సిఆర్‌పి జలకనూరి మురళీధర్ రాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులు

జాతీయ స్థాయి పరీక్షల్లో 'జ్ఞానదీప్తి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందలూరు : స్కాలర్స్ ఇంటిగ్రల్ మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ హైదరాబాద్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలలో తమ విద్యార్థులు సత్తాచాటారని జ్ఞాన దీప్తి పాఠశాల చైర్మన్ అద్దంకి జానకినాథ్, ప్రిన్సిపల్ నిడిగంటి లక్ష్మమ్మ, పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ జనవరి రెండో తేదీన బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పరీక్షలు నిర్వహించగా జనవరి 29వ తేదీన ఫలితాలు వెలబడ్డాయని అన్నారు. మ్యాథ్స్ విభాగంలో రెండవ ర్యాంకు లక్ష్మి జై, మూడవ ర్యాంకు, షేక్ అస్మ, సైన్స్ విభాగంలో షేక్ ఆయేషా, షేక్ ముస్తకిం, షేక్ మహమ్మద్ ఇబ్రహీంలు ముగ్గురు మూడవ ర్యాంకు సాధించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. తమ పాఠశాల నుండి 27 మంది విద్యార్థులు హాజరుకాగా ఐదు మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వారికి నగదు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీదేవి, మస్రత్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నయ్యగారిపల్లెలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని ఎర్ర చెరువుపల్లి గ్రామ పంచాయతీ చెన్నయ్యగారిపల్లె బిసి కాలనీలో మండల వైద్యధికారి డాక్టర్ కె.శరత్ కమల్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరంలో 30 మందికి చికిత్సలు నిర్వహించామన్నారు. జ్వరంతో బాధపడుచున్నవారు ఇద్దరు, బిసి, షుగర్‌తో 20 మందికి ఇతరులకు 8 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపకేంద్రంలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పి రజిని, ఎఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు